నమస్తే తెలంగాణ

**పెద్దపల్లి**

10 | కరీంనగర్, మంగళవారం 10 జూన్ 2025 | PEDDAPALLI


## ప్రముఖ వైద్యుడు భూంరెడ్డి ఇకలేరు

- అనారోగ్యంతో కన్నుమూత
- ఉత్తర తెలంగాణలోనే మొట్టమొదటి జనరల్ సర్జన్
- మొదటి ప్రధాని నెహ్రూకు సైతం వైద్యం అందించిన ఘనత
- ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షుడిగా సేవలు
- భీష్మ పితామహాగా గుర్తింపు
- సంతాపం ప్రకటించిన పలువురు ప్రముఖులు, వైద్యులు



డాక్టర్ వీ భూంరెడ్డి (ఫైల్)

కరీంనగర్ విద్యానగర్, జూన్ 9 : కరీంనగర్‌కు చెందిన ప్రముఖ, సీనియర్ వైద్యుడు, భీష్మ పితామహ వొంటేరి భూంరెడ్డి(91) సోమవారం కన్నుమూశారు. అస్వస్థతతో కెయిమ్స్ చల్మెడ ఆనందరావు ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) దవాఖానలో చేరిన ఆయన, సాయంత్రం 4:30 గంటలకు తుది శ్వాస విడిచారు. ఉత్తర తెలంగాణలోనే మొట్టమొదటి జనరల్ సర్జన్‌గా పేరున్న ఆయన, యూరాలజీ, న్యూరో సర్జరీ కేసులకు పెట్టింది పేరుగా ప్రఖ్యాతి ఘటించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పేదలకు వైద్య సేవే ఆస్తిగా భావించి చివరి వరకు సేవలందించారు. వైద్య విద్యార్థిగా పలు గోల్డ్ మెడల్స్ అందుకున్న భూంరెడ్డి అంతర్జాతీయంగా గుర్తింపు పొందారు. ఐఎంఏ జాతీయ ఉపాధ్యక్షుడిగా, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. ఇతర దేశాల నుంచి ఎన్నో అవకాశాలొచ్చినా మాతృభూమిపై ఉన్న మమకారం.. ముఖ్యంగా పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే దృఢ సంకల్పంతో కరీంనగర్‌ను కేంద్రంగా చేసుకొని తొలినాళ్లలో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు సేవలందించారు. భారత మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకి సైతం సర్జరీ చేసిన ఘనత పొందారు. కరీంనగర్‌లో లయన్స్ క్లబ్ రేకుర్తి కంటి దవాఖాన, శుశ్రుత క్యాన్సర్ దవాఖాన, కరీంనగర్ రెడ్-క్రాస్ సొసైటీ, ఐఎంఏ బిల్డింగ్ ట్రస్ట్, ఐఎంఏ హరితహారం వంటి వివిధ శాశ్వత ప్రాజెక్టులను ప్రారంభించడంలో కీలక పాత్ర పోషించారు. కెయిమ్స్ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. తన దగ్గరకు వచ్చే రోగులకు అన్ని రకాల వైద్య సేవలందించేవారు. భూంరెడ్డి 91ఏళ్ల వరకు కూడా ప్రజలకు సేవలందించడం గొప్ప విషయమని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ఒక ప్రకటనలో ప్రశంసించారు. ఆయన మృతిపై సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### పలువురు ప్రముఖుల సంతాపం

భూంరెడ్డి అంత్యక్రియలు మంగళవారం ఉదయం 10.30 గంటలకు కరీంనగర్‌లోని సప్తగిరి కాలనీ శ్మశాన వాటికలో నిర్వహించనున్నారు. సోమవారం ఆయన నివాసంలో ఉంచిన భౌతిక కాయం వద్ద వైద్యులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి, కెయిమ్స్ చైర్మన్ చల్మెడ లక్ష్మీనరసింహారావు, ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎనమల్ల నరేశ్, గౌరవ కార్యదర్శి డాక్టర్ సిరిపురం నవీన్ కుమార్, కోశాధికారి డాక్టర్ సీహెచ్ విజయ్ కుమార్, డాక్టర్ పీ కిషన్, మాజీ మేయర్ వై సునీల్‌రావు, సీనియర్ వైద్యులు మోహన్ రెడ్డి, అలీమ్, లక్ష్మణ్, అరుణ్ కటారి, ఎంఎస్ఎల్ స్రవంతి, స్వప్న, సునీల్ రెడ్డి, రవి, మేఘన, రాధిక, తదితరులు సంతాపం తెలిపారు.

## ఫిర్యాదుదారు వద్దకే న్యాయమూర్తి



విచారిస్తున్న న్యాయమూర్తి అరుణ్‌కుమార్

మెట్‌పల్లి, జూన్ 9 : పక్షపాతంతో బాధపడుతున్న ఓ మహిళా ఫిర్యాదుదారు కోర్టు హాల్‌లోకి రాలేని పరిస్థితి తెలుసుకున్న న్యాయమూర్తి స్వయంగా ఆమె వద్దకు వచ్చి విచారణ చేశారు. సోమవారం మెట్‌పల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈ ఘటన జరిగింది. ఈ నెల 14న జరగనున్న లోక్ అదాలత్‌లో భాగంగా రాజీ కేసుల విచారణ ప్రక్రియ ప్రారంభమైంది. ఇందులో ఇబ్రహీంపట్నం మండలం గోదూర్‌కు చెందిన చల్ల రమక్క, అదే గ్రామానికి చెందిన చల్ల మల్లేశ్, చల్ల శంకర్‌పై 2024లో ఫిర్యాదు చేయగా వారిపై ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో ఇరువురు రాజీ చేసుకోగా సోమవారం కోర్టుకు వచ్చారు. అయితే, ఫిర్యాదుదారురాలైన రమక్క పక్షపాతంతో నడలేని స్థితిలో ఆటోలో కోర్టు ఆవరణకు చేరుకున్నది. ఆమె పరిస్థితి తెలుసుకున్న జూనియర్ సివిల్ జడ్జి అరుణ్‌కుమార్ కోర్టు హాల్ నుంచి బయటకు వచ్చి ఆమె నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు.

## హుజూరాబాద్ డివిజన్‌లో సీడ్ మిల్లు వ్యాపారుల నయా దందా!

# సీడ్ మిల్లుల బోనస్ దోపిడీ?

- బోనస్ ధరతో కలిపి సన్నవడ్ల విత్తనాల విక్రయం
- క్వింటాల్‌కు ₹600 వరకు ధర అదనం
- ధాన్యం అమ్మిన రైతులకు మాత్రం మొండి చేయి
- కలెక్టర్ చొరవ చూపాలని వేడుకోలు

సీడ్ బస్తాలు




**హుజూరాబాద్ డివిజన్‌లో సీడ్ మిల్లు వ్యాపారుల నయా దందా తెరపైకి వస్తున్నది. బోనస్ చెల్లిస్తామని రైతుల నుంచి నెల క్రితమే సన్న వడ్లు సేకరించి.. ఇప్పటి వరకు డబ్బులు ఇవ్వకుండా దోచుకునే ప్రయత్నం కనిపిస్తున్నది. పైగా బోనస్‌తో కలిపి విత్తనాలు విక్రయిస్తూ.. దోపిడీ చేస్తున్నట్టు వెలుగులోకి వస్తున్నది. ఒక్కో 25 కిలోల బ్యాగుకు ₹150 చొప్పున క్వింటాల్‌కు అదనంగా ₹600 వరకు గుంజుతుండగా.. రైతులు రెండు విధాలా నష్టపోవాల్సి వస్తున్నది. ఈ విషయంలో కలెక్టర్ చొరవ చూపి ధాన్యం డబ్బులు ఇప్పించాలని రైతాంగం వేడుకుంటున్నది.**

హుజూరాబాద్, జూన్ 9 : హుజూరాబాద్ డివిజన్ సీడ్ వరికి కేరాఫ్‌గా ఉన్నది. ఇక్కడ పండిన సన్న వడ్ల విత్తనాలకు క్వాలిటీ పరంగా ఇతర రాష్ట్రాల్లో చాలా డిమాండ్ ఉన్నది. ఏటా సీజన్లలో ఇక్కడి సీడ్‌మిల్లు వ్యాపారులు ధాన్యం సేకరించి, మిల్లుల్లో శుద్ధి చేసి విత్తనాలుగా విక్రయిస్తున్నారు. మొన్నటి యాసంగిలోనూ సాగు చేసిన వరిలో సగానికిపైగా విత్తనాల కోసం ధాన్యం సేకరించారు. అయితే, ప్రభుత్వం సన్నాలకు ₹500బోనస్ ఇస్తానని ప్రకటించడంతో మద్దతు ధర ₹2,320కు బోనస్ కలిపి ₹2820 ఇస్తామని చెప్పి ధాన్యం తీసుకున్నారు. ఇలా సుమారు 2వేల మంది రైతుల నుంచి 40 వేల టన్నుల వరకు సేకరించారు. అత్యవసరమున్న కొందరు రైతులకు మాత్రం ₹2500 చొప్పున చెల్లించినా.. మిగతా రైతులకు ఇప్పటి వరకు రూపాయి కూడా చెల్లించలేదు. ప్రభుత్వంతో ఏం సంబంధం లేకున్నా సీడ్ వ్యాపారులు మాత్రం బోనస్ చెల్లింపుల్లో నిర్లక్ష్యం చేయడాన్ని సాకుగా చూపి ఇవ్వడం లేదు. బోనస్ ఇవ్వకపోగా వానకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో దోపిడీకి తెరలేపారు. బోనస్‌తో కలిపి విత్తనాల ధర నిర్ణయించి విక్రయించడం మొదలు పెట్టారు. వ్యాపారులు మాత్రం డబుల్ బోనస్ పొందుతూ, రైతులకు మాత్రం మొండి చేయి చూపే ప్రయత్నం చేస్తున్నారు.

### 25 కిలోల బ్యాగుపై ₹150 అదనం

రైతుల నుంచి సేకరించిన సన్నరకం ధాన్యాన్ని శుద్ధి చేసి 25 కిలోల చొప్పున బ్యాగులో నింపుతారు. దానికి కొంత లాభం చూసుకొని వ్యాపారులు ధర నిర్ణయించి విక్రయిస్తారు. గతేడాది ఇతర రాష్ట్రాల్లో 25 కిలోల విత్తన సంచికి ₹1249 ధర ముద్రించి విక్రయించారు. మన లోకల్ మార్కెట్లో మాత్రం ₹900 నుంచి ₹950 వరకు అమ్మారు. అప్పుడు ప్రభుత్వం బోనస్ ప్రకటించలేదు. అయితే, ఈ యేడు ప్రభుత్వం బోనస్ ప్రకటించింది. ఈ క్రమంలో రైతులు సీడ్ మిల్ యజమానులతో ప్రభుత్వం ఇస్తున్నట్టు బోనస్‌తో కలిపి ₹2820 చెల్లిస్తేనే ధాన్యం విక్రయిస్తామని చెప్పారు. దీంతో సీడ్ మిల్ యజమానులు ధర పెంచారు. 25 కిలోల విత్తన సంచికి ₹1449 ధర నిర్ణయించారు. ఈ మేరకు ఇతర రాష్ట్రాల్లో ఫర్టిలైజర్ అండ్ సీడ్ దుకాణాల వ్యాపారులు కొంచెం అటీటుగా ఇదే ధరకు విక్రయిస్తుండగా.. స్థానిక మార్కెట్లో మాత్రం ₹1050 నుంచి ₹1100 వరకు విక్రయిస్తున్నారు. గతేడాది ధరతో పోలిస్తే ₹150 అదనం కాగా, క్వింటాల్‌కు ₹600 లాభం పొందుతున్నారు.




కొత్తగా నిర్ణయించిన ధరతో విత్తన బస్తా

### రైతులకు నష్టం

ప్రభుత్వం బోనస్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవరిస్తుండడంతో సీడ్ వ్యాపారులు ధర విషయంలో కొరివి పెడుతున్నారు. బోనస్‌తో కలిపి విత్తనాలను విక్రయిస్తున్నా రైతులకు మాత్రం ఆ ధర ఇవ్వకుండా కొర్రీలు పెడుతున్నారు. అమ్మిన వడ్లకు డబ్బులు ఇవ్వకుండా.. విత్తన వడ్లకు బోనస్‌తో కలిపి విక్రయిస్తూ దోపిడీ చేస్తున్నారు. దీంతో రైతులు రెండు విధాలా నష్టపోతున్నారు. వడ్లు అమ్మి నెల దాటినా డబ్బులు రాక రైతులు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసరమై డబ్బులు అడిగితే ఎంతో కొంత ముట్టజెప్పే ప్రయత్నం చేస్తున్నారని వాపోతున్నారు. క్వింటాల్‌కు ₹2820 బదులు ₹2500 ఇస్తామని అంటున్నారని, కొందరు వ్యాపారులైతే కేవలం మద్దతు ధర అంటే ₹2,320 ఇస్తామని చెబుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా మోసం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేస్తున్నారు. ఈ విషయంలో కలెక్టర్ జోక్యం చేసుకోవాలని, వ్యాపారుల దగ్గరి నుంచి బోనస్‌తో కలిపి డబ్బులు ఇప్పించాలని వేడుకుంటున్నారు.

## లబ్ధిదారుల ఎంపికలో అర్హులకు అన్యాయం

- సమగ్ర విచారణ జరిపించాలి
- సీపీఐ నాయకుల ఆగ్రహం
- చిగురుమామిడి ఎంపీడీవో ఆఫీస్ ఎదుట ధర్నా
- పోలీసులతో వాగ్వాదం.. అరెస్ట్



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

చిగురుమామిడి, జూన్ 9 : ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాస పథకం లబ్ధిదారుల ఎంపికలో అర్హులకు అన్యాయం జరిగిందని సీపీఐ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు కాంగ్రెస్ నాయకులతో కుమ్మక్కై అనర్హులను ఎంపిక చేశారని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం చిగురుమామిడి ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీపీఐ మండల శాఖ ఆధ్వర్యంలో బైఠాయించి, ధర్నా చేశారు. ఉదయం 10 గంటలకు కార్యాలయానికి చేరుకొని తలుపులు తెరవకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చాలా గ్రామాల్లో అర్హులకు ఇళ్లు మంజూరు కాలేదని, కాంగ్రెస్ నాయకులు అధికారులతో కలిసి అనర్హులను ఎంపిక చేశారని ఆరోపించారు. రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల ఎంపికలో అర్హులకు న్యాయం జరగలేదన్నారు. పంచాయతీ కార్యదర్శులు, నాయకుల చేతివాటం చూపారని ఆరోపించారు. వీటిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ధర్నా విరమించాలని నాయకులకు ఎస్ఐ చందబోయిన శ్రీనివాస్ నచ్చజెప్పగా, వారు సమేమిరా అన్నారు. అధికారుల విధులకు ఆటంకం కలిగించొద్దని సూచించారు. అయినా వినిపించుకోలేదు. కాసేపు ఇరు వర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో పాటు నాయకులందరినీ అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ధర్నాలో మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మిరెడ్డి, సహాయ కార్యదర్శి బూడిద సదాశివ, జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, రైతు సంఘం మండలాధ్యక్షుడు గోలి బాపురెడ్డి, కోమటిరెడ్డి జైపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌కు మరొకరు బలి



వంశీ (ఫైల్)

సిరిసిల్ల రూరల్, జూన్ 9 : ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌కు మరో యువకుడు బలయ్యాడు. అప్పులు చేసి బెట్టింగ్ పెట్టి మోస పోవడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లెకు చెందిన తుమ్మల వంశీ(25) కరీంనగర్‌లో వీల్ అలైన్‌మెంట్ మెకానిక్ వర్క్ చేస్తున్నాడు. ఈ క్రమంలో మూడేళ్లుగా బెట్టింగ్ మోజులో పడి స్నేహితులు, తెలిసినవారి నుంచి ₹10 లక్షల వరకు అప్పులు చేశాడు. బెట్టింగ్‌లో మొత్తం కోల్పోవడంతో ఆందోళనకు గురయ్యాడు. సోమవారం తమ గ్రామ శివారులోని పొలం ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. వంశీ తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.



గూడెం -ఆవునూర్ గ్రామాల మధ్యన ప్రధాన రహదారికి ఇరువైపులా ఆహ్లాదం పంచుతున్న చెట్లు

## హరితహారం.. పచ్చని తోరణం

ముస్తాబాద్, జూన్ 9 : బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన 'హరితహారం' అద్భుత ఫలితాలనిచ్చింది. తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్ తెచ్చిన ఈ కార్యక్రమంతో అంతటా పచ్చదనం పరుచుకున్నది. అందుకు ఈ దృశ్యమే నిదర్శనంగా నిలుస్తున్నది. ముస్తాబాద్ మండలం నామాపూర్ నుంచి గూడెం, ఆవునూర్ వరకు సిరిసిల్ల జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి ఇరువైపులా నాడు నాటిన మొక్కలు నేడు వృక్షాలను తలపిస్తున్నాయి. వాహనదారులకు ఆహ్లాదం పంచుతున్నాయి.



కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న మడిపల్లి గ్రామ మహిళలు

## ఇందిరమ్మ ఇండ్లు మాకెందుకివ్వరు?

- కమిటీలు మాకు అన్యాయం చేశాయి
- మడిపల్లి గ్రామ మహిళల ఆగ్రహం
- కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 9 : నిరుపేదలమైన తమకు ఇందిరమ్మ ఇండ్లు ఎందుకు ఇవ్వడం లేదని జమ్మికుంట మండలం మడిపల్లి గ్రామాని చెందిన 30 మంది మహిళలు ప్రశ్నించారు. ప్రభుత్వం విడుదల చేసిన నిబంధనల మేరకు ఇళ్లు పొందేందుకు అన్ని అర్హతలున్నా, తమకు అన్యాయం చేశారని, ఇండ్లునోళ్లకే మళ్లీ ఇచ్చారని మండిపడ్డారు. అధికారులు, కాంగ్రెస్సోళ్లు కుమ్మక్కై వాళ్ల మద్దతుదారులకే కట్టబెట్టారని ధ్వజమెత్తారు. ఈ మేరకు సోమవారం కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. ఇందిరమ్మ ఇండ్లు ఎందుకు మంజూరు చేయడం లేదో చెప్పే వరకు కదిలేది లేదని ప్రధానం ద్వారం ఎదుట భీష్మించుకుని కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తమవి రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులని, తమకు గూడు లేక అద్దె ఇళ్లలో కాలం వెల్లదీస్తున్నామని వాపోయారు. తమకు ఇందిరమ్మ ఇళ్లు వస్తాయన్న ఆశతో ఉంటే, ఇందిరమ్మ కమిటీలు తమ నోట్లో మట్టికొట్టాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు కాంగ్రెస్ నాయకుల తొత్తులుగా మారారని, ముందుగా ఎంపిక చేసిన జాబితాలో తమ పేర్లు ఉన్నాయని, తాజాగా విడుదల చేసిన జాబితాలో మాత్రం చోటు దక్కలేదని కన్నీటి పర్యంతమయ్యారు. అధికారులు, కాంగ్రెస్ నేతలకు శాపనార్థాలు పెడుతూ కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట గంటకు పైగా బైఠాయించారు. అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరుగుతున్న ప్రజావాణికి తరలివెళ్లి కలెక్టర్ ఎదుట గోడు వెల్లబోసుకున్నారు. ఈ ఆందోళనలో లక్ష్మి, ప్రియాంక, భారతి, దూడపాక వాణి, పద్మ, మంజుల, మమత, రైసున్నీసా, సుమలత పాల్గొన్నారు.

## అవస్థల మధ్యే రాజన్న దర్శనం

- క్యూలో ఇబ్బందులు పడ్డ భక్తులు
- దర్శనానికి ఆరు గంటలు
- అపరిశుభ్రంగా ఆలయ పరిసరాలు
- పట్టించుకోని అధికారులు



ఆలయ ఆవరణలో చెత్తా చెదారం



బారులు తీరిన భక్తులు

వేములవాడ టౌన్, జూన్ 9 : ఓవైపు వేసవి సెలవులు ముగుస్తుండడం, మరోవైపు రాజన్న ఆలయాన్ని త్వరలో మూసివేస్తారని ప్రచారం సాగుతుండడంతో భక్తుల సంఖ్య రెట్టింపైంది. సాధారణ రోజుల్లో 25 వేల నుంచి 30వేల మంది వస్తుండగా, ప్రస్తుతం 40వేల నుంచి 50వేల వరకు రావడం కనిపిస్తున్నది. ఆది, సోమ, శుక్రవారాల్లో 50వేల నుంచి 60వేల మంది భక్తులు వస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం సైతం 60వేల మందికిపైగా రాగా, అందుకు తగిన ఏర్పాట్లు లేక భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. క్యూలైన్లకు సంబంధించి సూచిక బోర్డులు, మార్కింగ్ లేక ఎటు వెళ్లాలో తెలియక అవస్థలు పడ్డారు. దర్శనానికి ఆరు గంటల పాటు క్యూలైన్లలో నిరీక్షించాల్సి వచ్చిందని వాపోయారు. క్యూలైన్లో కనీసం మంచినీటి సదుపాయం కూడా లేదని ఆవేదన చెందారు. కోడె మొక్కు టికెట్ కోసం పార్కింగ్ స్థలం వద్ద క్యూలైన్లో దాదాపు 4 గంటల సమయం పట్టిందని తెలిపారు. ఆలయం తూర్పు భాగంలో నుంచి ₹100 టికెట్ తీసుకుని దర్శనానికి వెళ్తే ఆలయ పరిసరాలు దుర్గంధభరితమైన వాసనతో ఉన్నాయని కొందరు భక్తులు ఆగ్రహించారు. గతంలో వేములవాడకు వచ్చిన ప్రతీసారి దర్శనం చాలా సవ్యంగా జరిగేదని, ఈసారి మాత్రం చేదు అనుభవం మిగిలిందని చెప్పారు.

## బీడీ కార్మికులకు పింఛన్ ఇవ్వాలి



తహసీల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీడీ కార్మికులు

కోనరావుపేట, జూన్ 9: పీఎఫ్ ఉన్నా అర్హులైన బీడీ కార్మికులకు పింఛన్ ఇవ్వాలని సీపీఎం జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి కోరారు. సోమవారం తహసీల్ కార్యాల యం ఎదుట బీడీ కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మా ట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హామీలను తుంగలో తొక్కిందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం అధికారంలో కి వచ్చి 18నెలలు గడుస్తున్నా.. ఇప్పటివరకు ఒక్క హామీ కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. బీడీ కార్మికులకు పింఛన్ ఇవ్వక పోతే జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపడుతామని హెచ్చరించారు.

## సహస్రను ఆదుకోండి

- రోడ్డు ప్రమాదంలో అమ్మానాన్నను కోల్పోయి దవాఖాన పాలైన నాలుగేళ్ల చిన్నారి
- గ్రేడెడ్ స్పైనల్ కార్డ్‌కు తీవ్రగాయం
- కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో వైద్యం
- చికిత్సకు ₹10 లక్షల వరకు ఖర్చవుతుందన్న వైద్యులు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు



దవాఖానలో చికిత్స పొందుతున్న సహస్ర

పాలకుర్తి, జూన్ 9 : రోడ్డు ప్రమాదంలో అమ్మానాన్నను కోల్పోయిన నాలుగేళ్ల చిన్నారి, తీవ్ర గాయంతో తల్లడిల్లుతున్నది. గ్రేడేడ్ స్పైనల్ కార్డ్‌కు గాయం కావడంతో చికిత్సకు డబ్బుల్లేక సాయం కోసం ఎదురుచూస్తున్నది. మానవతావాదులు స్పందించి తనకు కొత్త జీవితం ఇవ్వాలని వేడుకుంటున్నది. వివరాల ప్రకారం.. ఈ నెల5న బసంత్‌నగర్‌కు చెందిన గుంటిపెల్లి రాము, తన భార్య అనూష (26), నాలుగేళ్ల కూతురు సహస్రతో కలిసి బైక్‌పై హుస్నాబాద్‌లో జరుగనున్న తన బామ్మర్ది (భార్య తమ్ముడు) పెళ్లికి వెళ్తుండగా, సుల్తానాబాద్ సుగ్లాంపల్లి వద్ద ప్రమాదం జరిగింది. లారీ అదుపు తప్పి రాంగ్‌రూట్‌లోకి వెళ్లి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలు అక్కడికక్కడే మృతి చెందగా, చిన్నారి సహస్ర తీవ్రగాయాలపాలైంది. మొదట సుల్తానాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. ఆమెకు నానమ్మ, బంధువులు చికిత్స చేయిస్తున్నారు. అయితే, సహస్ర గ్రేడేడ్ స్పైనల్ కార్డ్‌కు తీవ్ర గాయం కావడంతో వైద్యులు ఆపరేషన్ చేయాలని సూచించారు. దీనికి సుమారు ₹10 లక్షల వరకు ఖర్చవుతాయని చెప్పడంతో నానమ్మ ఆందోళన చెందుతున్నది. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబమని, మానవతావాదులు స్పందించి చిన్నారిని బతికించాలని వేడుకుంటున్నది. తల్లిదండ్రులను కోల్పోయి ఐసీయూలో పోరాడుతున్న చిన్నారికి కొత్త జీవితం ప్రసాదించాలని కోరుతున్నది. దయార్థ్ర హృదయులు సాయం (9492981030) ఫోన్ పే చేయాలని విన్నవిస్తున్నది.